తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
శనివారం
10 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :



# అధికారుల నిర్లక్ష్యం సిద్ధంగా ఉన్నా తెరుచుకోని పంచాయతీ భవనం!



○ప్రారంభోత్సవానికి ముహూర్తం దొరకలేదా?

○ ప్రజాధనం వృథా చేస్తున్న పాలకుల వైఖరిపై తీవ్ర ఆగ్రహం!

**మాడుగులపల్లి, అక్టోబర్ 9 ( జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవన పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా, నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం అధికారుల, ప్రజాప్రతినిధుల అలసత్వానికి అద్దం పడుతోంది విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్, తలుపుల అమరికతో సహా అన్ని పనులూ పూర్తయి భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, తలుపులు తెరవడంలో పాలకులు చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**సొంత భవనమున్నా అద్దె కొంపలోనే పాలన!**

ఒకవైపు సర్వాంగ సుందరంగా నూతన భవనం రూపుదిద్దుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంటే, మరోవైపు పంచాయతీ పాలన మాత్రం అరకొర వసతులున్న అద్దె భవనంలోనే కొనసాగుతుండటం విడ్డూరంగా మారింది ప్రతినెలా ప్రజల సొమ్మును అద్దెల రూపంలో వృథా చేస్తూ, సిబ్బందిని, వచ్చే ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రజాప్రతినిధుల సమయం కుదరడం లేదనే నెపంతోనే భవనాన్ని ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారా? అని పల్లె జనం ఆగ్రహంతో రగిలిపోతున్నారు

**తాళాలు తీయకపోతే మూసి ఉన్న భవనం పాడైపోదా?**

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని మూసి ఉంచడం వల్ల లోపల ఉన్న ఫర్నిచర్, కరెంట్ వైరింగ్ పాడైతే దానికి బాధ్యులు ఎవరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, ఆర్భాటాలకు పోకుండా గండ్రవానిగూడెం నూతన పంచాయతీ భవనాన్ని తక్షణమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ - మాజీ ఎంపీ నామ

### బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత కేసీఆర్‌దే : మాజీ ఎంపీ నామ



**ఖమ్మం , అక్టోబర్ 09 (జనంసాక్షి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలంగాణ ఆడపడుచులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు విశేష ప్రాధాన్యత కల్పించి, రాష్ట్ర పండుగగా గుర్తింపుతో పాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని విస్తృతంగా చాటిచెప్పేందుకు కృషి చేసిందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు తొమ్మిది పేర్లతో పూలను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తాయని నామ తెలిపారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ నుంచి చివరి రోజు సద్దుల బతుకమ్మ వరకు ప్రతి రోజుకు ప్రత్యేకత ఉంటుందని నామ స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనివ్వడం ద్వారా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు మరింత గుర్తింపు లభించిందని వివరించారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఈ తొమ్మిది రోజుల సంబరాలను మహిళలందరూ సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని నామ ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో ఆనందం, ఐక్యత, సౌభాగ్యాన్ని నింపాలని కోరారు

○ఈ పండుగకు అధికారిక గుర్తింపు నిచ్చిన ఘనత కెసిఆర్ దే

○బతుకమ్మ, దేవీ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి

○ప్రజలందరికీ బతుకమ్మ, శరన్నవ రాత్రుల శుభాకాంక్షలు

○మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**సూర్యాపేట (జనంసాక్షి):** మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులందరికీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.శనివారం పితృ అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ ఉత్సవాలతో పాటు ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవి శరన్నవరాత్రోత్సవాలు ఐక్యతతో, ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎక్కడా లేని విధంగా ప్రకృతిని ఆరాధిస్తూ మిగతా 2లో

## బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన పువ్వాడ



**ఖమ్మం, అక్టోబర్ 9 జనంసాక్షి** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు, సమస్త ప్రాణకోటికి జీవనాధారమైన ప్రకృతి వైభవానికి ప్రతిరూపమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నుంచి బతుకమ్మ పండుగ సంబరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో బతుకమ్మ కీలక పాత్ర పోషించిందని, అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిచ్చి, ఘనంగా వేడుకలు నిర్వహించడంతో పాటు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ పండుగకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం తగ్గిందనే భావన ప్రజల్లో ఉందని అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే పండుగల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే ప్రజలు హర్షించరని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయబద్ధంగాఆటపాటలతో, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆకాంక్షించారు.

# జిల్లా దశాబ్ది కార్యక్రమాలను విజయవంతం చేయాలి

## మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 9 ( జనంసాక్షి )** తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా దశాబ్ది కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు సూచించారు. జిల్లాలవారీగా కార్యక్రమాలు చేపట్టి ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిందని నామ గుర్తుచేశారు. గతంలో ఉన్న 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో పాటు ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమమైందని వివరించారు. జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన పరిస్థితులు తగ్గడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా, వైద్య సదుపాయాల విస్తరణకు కొత్త జిల్లాలు దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాభై వేల కోట్ల రూపాయలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టారని నామ వివరించారు. ఖమ్మం ఐటీ హబ్ ద్వారా ఐటీ రంగంలో అవకాశాల కల్పన, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా వైద్య విద్య విస్తరణకు ప్రాధాన్యత లభించిందన్నారు. సాగునీటి రంగంలో సీతారామ ఎత్తిపోతల పథకం, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆధునీకరణ వంటి ప్రాజెక్టులు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి కీలకమైనవిగా నిలిచాయని పేర్కొన్నారు. సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు కూడా ఈ ప్రాంత సాగునీటి, విద్యుత్ అవసరాలకు సంబంధించి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా నిలిచిందని తెలిపారు. ఖమ్మం నగరంలో నూతన బస్‌స్టాండ్ కాంప్లెక్స్, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణాలు రవాణా, పరిపాలనా సదుపాయాల విస్తరణలో ముఖ్యమైనవని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖలను ఒకే ప్రాంగణంలోకి తీసుకురావడం ప్రజలకు పరిపాలనా సేవలు అందించడంలో సౌలభ్యాన్ని కల్పించిందన్నారు. భద్రాచలం ప్రాంతంలో వరద ముప్పు నుంచి ప్రజలను కాపాడేందుకు కరకట్ట, ఫ్లడ్ బ్యాంక్ అభివృద్ధి అంశాలతో వార్తా లోపలి పేజీలో

## జిల్లా దశాబ్ది కార్యక్రమాలను విజయవంతం చేయాలి : మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

పాటు ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ మార్కెట్ వంటి మౌలిక సదుపాయాలు కూడా జిల్లా అభివృద్ధిలో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని వివరించారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులను నాలుగు లైన్ల రోడ్లుగా విస్తరించడం, సెంట్రల్ లైటింగ్, ఆధునిక జంక్షన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు, మహిళలు, పేద కుటుంబాలు, విద్యార్థులు, గిరిజనుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేసినట్లు నామ పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి?షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, గురుకుల విద్యాసంస్థలు, ఆరోగ్యశ్రీ వంటి కార్యక్రమాల ద్వారా వివిధ వర్గాలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే ప్రయత్నం జరిగిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం చేపట్టిన పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు స్థానిక మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యతనిచ్చాయని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం, అంతర్గత రహదారులు, ఇతర సదుపాయాల అభివృద్ధితో పాటు పట్టణాల్లో డ్రైనేజీలు, రహదారులు, వీధి దీపాలు, ప్రజా సదుపాయాల కల్పనకు ఈ కార్యక్రమాలు దోహదపడ్డాయని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల వంటి సదుపాయాల కల్పనతో పాటు అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంపై నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

జరుపుకునే బతుకమ్మ తెలంగాణ ఉద్యమంతో ఖండాంతరాలకు విస్తరించిందని తెలిపారు.పోరాడి సాధించిన తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపునిచ్చి అధికారికంగా నిర్వహించునేలా చేసిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు.ఆనాటి నుంచే బతుకమ్మ పర్వదినాన్ని అధికారికంగా జరుపుకుంటున్నామని అన్నారు.ఎంగిలి పువ్వుతో ప్రారంభమయ్యే బతుకమ్మ, దేవీ నవరాత్రుల పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ బతుకమ్మ, దేవి శరన్నవరాత్రోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా రావులపల్లి జన్మదిన వేడుకలు

## ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలి

**భద్రాచలం అక్టోబరు 09 (జనంసాక్షి)**

భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని తెలంగాణ టూరిజం హరిత హోటల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. భద్రాచలం మండల బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని రాంప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ, రావులపల్లి రాంప్రసాద్ ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లో ముందుకు సాగుతున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాంప్రసాద్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.అనంతరం కేక్ కట్ చేసి రాంప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## కులమతాలకు అతీతంగా ప్రతిభ విద్యాలయంలో బతుకమ్మ సంబరాలు

**ఐక్యతకు ప్రతీకగా వేడుకలు..**

**పాఠశాల యాజమాన్యాన్ని అభినందించిన మాలోత్ భోజ్య నాయక్**

**చంద్రుగొండ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయంలో కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కాంగ్రెస్ నాయకులు మాలోత్ భోజ్య నాయక్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తూ, విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ప్రతిభ విద్యాలయ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, సర్పంచ్ రుక్మిణి, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యులు ఎస్.కె. ఇమ్రాన్, మండల మైనారిటీ అధ్యక్షులు ఎస్.కె. అన్వర్, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, షబ్బీర్, ఎస్.కె. వసీం పాషా, కడియాల పుల్లయ్య, మనోహర్, హరీష్, నాగులమీర తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

# తొమ్మిది నెలలుగా అర్ధాంతరంగా సెంట్రల్ లైటింగ్ పనులు!

**○దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి.. రోడ్డెక్కిన గ్రామస్తులు ○ ఎగిరిపడుతున్న రాళ్లు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు**

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):**

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు గత తొమ్మిది నెలలుగా అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును తవ్వి అలాగే వదిలేయడంతో దుమ్ము, ధూళి సమస్యతో పాటు ప్రమాదాల భయం వెంటాడుతోంది. పనులు పూర్తి చేయాలని పలుమార్లు కోరినా అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామస్తులు ప్రధాన సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**దుమ్ముతో దుకాణాలు, ఇళ్లు ఉక్కిరిబిక్కిరి!**

సెంట్రల్ లైటింగ్ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనాలు రాకపోకలు సాగించిన ప్రతిసారీ భారీగా దుమ్ము లేస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము నేరుగా ఇళ్లలోకి, దుకాణాల్లోకి చేరుతుండటంతో వ్యాపారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు దుమ్ము కారణంగా శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు వేగంగా వెళ్లే సమయంలో రాళ్లు ఎగిరిపడి పాదచారులకు తగులుతున్నాయని, దీంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యపై కాంట్రాక్టర్‌కు, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతోనే రోడ్డుపైకి వచ్చామని తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు కనీసం రోడ్డుపై నీళ్లు చల్లి దుమ్ము నియంత్రించాలని నినాదాలు చేశారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఎస్ఐ హామీతో ఆందోళన విరమణ**

గ్రామస్తుల రాస్తారోకో విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ విజయసింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో సెంట్రల్ లైటింగ్ పనులు తిరిగి ప్రారంభించేలా చూస్తామని, శనివారం నుంచే రోడ్డుపై నీళ్లు చల్లించి దుమ్ము సమస్యను నివారిస్తామని తెలిపారు. ఎస్ఐ హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారగాని అశోక్, పానుగంటి రాఘవులు, ఐల్లూరి కృష్ణారెడ్డి, చల్ల రాంబాబు, ఆదివాసీ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర, పానుగంటి రామారావు, పరంకుశం రాజా, చందు, శ్రీను, అంజి, రవి రాజా, సురేష్, మడివి సూర్యం, వ్యాపార యజమానులు, ఆటో యూనియన్ సభ్యులు, గ్రామ యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





## కల్లు గీత వృత్తి ఆధునికీకరణకు రూ.5 వేల కోట్లు కేటాయించాలి

**కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండం కరుణాకర్**

**ఖమ్మం రూరల్,అక్టోబర్ 9:(జనంసాక్షి)**

కల్లు గీత వృత్తి ఆధునికరణకు రూ 5 వేల కోట్లు కేటాయించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండం కరుణాకర్ అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోనే తెల్దారురుపల్లిలో ఎరకల కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీత వృత్తుల్లో ఆధునిక పద్ధతులు అమలవుతున్నా.. ప్రమాదకరమైన కల్లుగీత వృత్తిలో మాత్రం ఆశించిన మార్పులు రావడం లేదని పేర్కొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని, గీత కార్మికుల పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన కార్మికులందరికీ షరతులు లేకుండా పెన్షన్ ఇవ్వాలని, కార్మికుడు మరణిస్తే భార్యకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ప్రతి సొసైటీకి చెట్ల పెంపకం కోసం ఐదెకరాల భూమి కేటాయించాలని సూచించారు. మద్యం దుకాణాల్లో 25 శాతం రిజర్వేషన్ సొసైటీలకు కల్పించాలని, ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు కోటయ్య, జలగం వెంకట్రావు, బోడపట్ల కార్తీక్, బోడపట్ల నగేష్, బండారు శ్రీను, సత్యం, నాగయ్య, రామకృష్ణ, వంగూర్ వెంకన్న, మండవ శ్రీను, మండవ సైదులు, బొమ్మగాని రమేష్, బోడపట్ల పాండు, ఆలూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు.. కళ్లజోళ్ల పంపిణీ

- 95 విద్యాసంస్థల్లో 25 వేల మంది విద్యార్థులకు సేవలు
- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తొలి విడత కార్యక్రమం ప్రారంభం




**భద్రాచలం అక్టోబర్ 09 (జనంసాక్షి)**
గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ సూచనలు, సహకారంతో శుక్రవారం భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**- తొలి విడతలో 95 విద్యాసంస్థల్లో సేవలు**

ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తొలి విడతలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన విద్యాసంస్థలకు చెందిన 25 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. రెండో విడతలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మంలోని మ్యాక్సివిజన్‌కు చెందిన శరత్ సాంకేతిక బృందం సహకారం అందిస్తోందని, తొలి విడత ప్రారంభ కార్యక్రమంలో భాగంగా 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు.

**- పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి**

ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధి పెరుగుతున్న నేపథ్యంలో వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం ఎంతో అవసరమని రెడ్‌క్రాస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాల్వంచలో ప్రభుత్వం కేటాయించిన 25 సెంట్ల స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు సమకూర్చాలని కోరారు. గిరిజన విద్యార్థుల సంక్షేమానికి సహకరిస్తున్న జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుమలత, వైస్ ప్రిన్సిపాల్ పుణ్యవతి, రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి టి.వి. బాలయోగి, రాష్ట్ర కమిటీ సభ్యుడు వై. సూర్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు యడవెల్లి కృష్ణ, అవులూరి సత్యనారాయణ, బీబీజీ తిలక్, పల్లంటి దేశప్ప, కంభంపాటి రవి, కండెలవాల సతీష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

### భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తజనం

**భద్రాచలం అక్టోబరు 09 (జనంసాక్షి)**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ వేడుక భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ముందుగా శ్రీరామ సేవా మండపంలో స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం వైదిక బృందం సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువును ప్రారంభించింది. స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన తరువాత భక్తుల గోత్రనామాలను చదివి వినిపించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని దర్శించుకున్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

### ప్రగతి విద్యానికేతన్‌లో ఉత్సాహంగా వేడుకలు

**విద్యార్థులకు బతుకమ్మ విశిష్టతను వివరించిన ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య**

**అశ్వాపురం అక్టోబర్ 9 (జనంసాక్షి):**
మండలవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మొండికుంట గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ మర్రి సంధ్య ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా మల్లెలమడుగులోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జి. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలతో జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.



# జిల్లా పంచాయతీ అధికారి సుడిగాలి పర్యటన

### ఉపాధి కూలీలతో మాట- ముచ్చట- ఇంకుడు గుంతల పరిశీలన

### -నూతన పెన్షన్ల పై విచారణ



**కామేపల్లి,అక్టోబర్ 9 (జనం సాక్షి):-**
మండలంలో పలు గ్రామపంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి జి వినోద్ శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులకు వెళుతున్న కూలీలతో మాట్లాడారు. రోజు ఉపాధి పనికి వెళ్తే కూలీ ఎంత పడుతుందని కూలీలను ప్రశ్నించారు. గ్రామంలో ఇతర పనులు దొరుకుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ముచ్చర్ల గ్రామ పంచాయతీలో నిర్మించిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఇంకుడు గుంతలు త్వరతి గతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ఇతర పనులు లేవని ఉపాధి పనులకు వచ్చే కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా సాతాని గూడెం గ్రామంలో కొత్తగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శాస్త్రి ఏపీవో శ్రీరాణీ, ఈ సి దామళ్ళ వెంకటేశ్వర్లు సాతాని గూడెం సర్పంచ్ భూక్య రెడ్యా, ముచ్చర్ల , సాతానిగూడెం పంచాయతీ కార్యదర్శులు అనురాధ,లావణ్య ఉపాధి హామీ పథకం టెక్నికల్,ఫీల్డ్ అసిస్టెంట్లు,మేట్లు తదితరులు పాల్గొన్నారు.



# రంగురంగుల పూలతో బతుకమ్మల పేర్పు

### ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు

**భద్రాచలం అక్టోబరు 09 జనంసాక్షి**
భద్రాచలంలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికల ఏ, బీ వసతి గృహాల్లో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వార్డెన్ స్వరాజ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థినులు తమ స్వగ్రామాలకు వెళ్లనున్నందున ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించినట్లు వార్డెన్ స్వరాజ్యం తెలిపారు. సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను తెలుసుకుంటూ, సంస్కృతి పట్ల మమకారాన్ని పెంపొందించుకునేలా ఈ వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు.

# పూల పల్లకిలో పల్లె బడి!

### మాదాపురం పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబురాలు

### ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు

**ముదిగొండ, (జనంసాక్షి) :**
పలకా బలపం పట్టే చిన్నారుల చేతులు పూల కొమ్మలయ్యాయి.. నిత్యం చదువుల సందడితో ఉండే ఆ ప్రాంగణం పూల తోటగా మారింది. మండల పరిధిలోని మాదాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబురాలు శుక్రవారం అంబరాన్నంటాయి. పాఠశాల ప్రవేశద్వారం నుంచి మొదలుకొని ప్రాంగణమంతా పసుపు, కుంకుమలు, మామిడి తోరణాలు, రంగురంగుల ముగ్గులతో ముస్తాబు చేశారు. విద్యార్థులు తీసుకొచ్చిన తంగేడు, గుమ్మడి, బంతి, గునుగు పూలతో తీర్చిదిద్దిన ఏడంతస్తుల బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు బతుకమ్మ చుట్టూ చేరి 'ఉయ్యాలో.. ఉయ్యాలో..' అంటూ చప్పట్లు కొడుతూ లయ బద్ధంగా ఆడిన తీరు చూపరులను కట్టిపడేసింది.



**సంస్కృతిని నిలబెట్టాలి: సర్పంచ్ నాగమణి**

ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ ప్రతీక అని కొనియాడారు. విద్యార్థినులకు గాజులు తొడిగి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులు ఇంత అద్భుతంగా బతుకమ్మను పేర్చడం, సంప్రదాయ నృత్యాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంలోనూ ముందంజలో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, సామెల్, అంగన్‌వాడీ కార్యకర్త ఉమాదేవి, గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం పిల్లలకు ప్రసాద వితరణ చేపట్టారు. చివరగా సమీప జలాశయంలో బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# ఇంటికి చేరిన కస్తూరిబా విద్యార్థినులు

**మాడుగులపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):**
మాడుగులపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) శనివారం నుంచి వరుస సెలవులు ప్రారంభం కానుండటంతో శుక్రవారం మధ్యాహ్నమే పాఠశాల ఖాళీ అయింది తరగతులు పూర్తికాగానే విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. చిన్నారులను తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకున్నారు తోటి స్నేహితులకు, ఉపాధ్యాయులకు సెలవుల శుభాకాంక్షలు తెలుపుకుంటూ విద్యార్థినులు సంతోషంగా నివాసాలకు బయలుదేరి వెళ్లారు.



# 25 ఏళ్లుగా రహదారి కోసం ఎదురుచూపులు!

○ చింతకుంటకు రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి..

○ ఎమ్మెల్యే పాయం కు ఆదివాసీ గిరిజనుల వినతి..

**బూర్గంపహాడ్ అక్టోబరు 09 (జనంసాక్షి)**

సుమారు 25 ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని మోతె గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంట ఆదివాసీ గిరిజనులు కోరారు. ఈ మేరకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు.

**- వర్షాకాలంలో నరకప్రాయంగా ప్రయాణం**

చింతకుంట గ్రామంలో సుమారు 25 ఏళ్లుగా నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దారిలో నీటి గుంతలు ఏర్పడటంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొన్నారు. రహదారి సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, వృద్ధులు, గర్భిణులు వైద్యసేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సు గ్రామంలోకి వచ్చే అవకాశం లేకపోవడంతో రహదారి వరకు రోగులను మంచాలపై మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

**త్వరలో రహదారి నిర్మాణానికి హామీ**

మోతె గ్రామం నుంచి చింతకుంట వరకు శాశ్వత రహదారి నిర్మించడంతోపాటు విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును గిరిజనులు కోరారు. తమ గ్రామ సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. చింతకుంట గ్రామానికి రహదారి, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించే దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తానని తెలిపారు. త్వరలోనే రహదారి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని గిరిజనులకు హామీ ఇచ్చారు.






ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో

## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 9(జనంసాక్షి):**

స్థానిక ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ.. మహిళా సాధికారతే ప్రియదర్శిని విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించి, వారిని ఆత్మవిశ్వాసంతో కూడిన నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కేవలం డిగ్రీకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలు, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల గోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. టాస్క్, ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ సహకారంతో శిక్షణ కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని, మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలోని నైపు ణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఏఐపై ఉచిత శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ మాట్లాడుతూ.. విద్యార్థినులు పరస్పర సహ కారం, క్రమశిక్షణతో చదువుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థినుల నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**అర్హులైన పేదలందరికీ రెండో విడతలో ఇళ్లు మంజూరు చేయాలి: సీపీఎం**

**బూర్గంపహాడ్ అక్టోబర్ 09 (జనంసాక్షి)**

ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, రెండో విడతలో అర్హులైన నిరుపేదలందరికీ రాజకీయ జోక్యం లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని బూర్గంపాడు మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం అభివృద్ధి కార్యక్రమాలు, ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవానికి వచ్చిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇంటి స్థలం లేని పేదలకు స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఇళ్ల స్థలాల సాధన కోసం ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, మొదటి విడతలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేశామని, పెండింగ్‌లో ఉన్న చివరి బిల్లులు కూడా త్వరలో విడుదలవుతాయని తెలిపారు. రెండో విడతలోనూ నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, ఎస్కే అబిదా, కనకం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.






## దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

**కామేపల్లి మండల విద్యాశాఖాధికారి జి.వెంకట్ హెచ్చరిక**

**ఈ నెల 10 నుంచి 22 వరకు పాఠశాలలకు దసరా సెలవులు**

**కామేపల్లి,అక్టోబర్ 9 (జనంసాక్షి):**

దసరా సెలవుల సమయంలో మండలంలోని ఏ పాఠశాలలోనూ తరగతులు నిర్వహించకూడదని కామేపల్లి మండల విద్యాశాఖాధికారి జి.వెంకట్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కామేపల్లి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్,ప్రైవేటు పాఠశాలలకు దసరా సెలవులు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.సెలవుల సమయంలో ఎలాంటి ప్రత్యేక తరగతులు,బోధనా కార్యకలాపాలు నిర్వహించరాదని ప్రధానోపాధ్యాయులు,పాఠశాల యాజమాన్య ప్రతినిధులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు.?ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై విద్యాశాఖ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, కరస్పాండెంట్లు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ వెంకట్ సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం కావాలి

## మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరులోని వీకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ స్థాయి సన్నాహక సమావేశం.

**కల్లూరు అక్టోబర్ 9(జనం సాక్షి)**

త్వరలోజరగనున్నఖమ్మం, నల్గొండవరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కల్లూరులోని వీకేఆర్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ముఖ్య నేతలు, బూత్ ఏజెంట్లతో బూత్ స్థాయి సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ప్రతి గ్రామం, ప్రతి మండలంలో బూత్ ఏజెంట్లు చురుకుగా వ్యవహరిస్తూ అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, వారికి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులుమాజీ జెడ్పిటిసిలు కట్టా అజయ్ కుమార్, మేకల కృష్ణ, కౌన్సిలర్ లక్కినేని రఘు, కాటమనేని వెంకటేశ్వర రావు , పాలెపురామారావ్ , మున్సిపాలిటీ కౌన్సిలర్ లు పంచాయతీల సర్పంచులు,ముఖ్య నేతలు, బూత్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# దమ్మపేట మండలంలో
# అర్ధరాత్రి మట్టి తవ్వకాలు!

○నిబంధనలు బేఖాతర్.. రాత్రివేళ మట్టి తరలింపుపై అనుమానాలు.

○మట్టి మాఫియా కార్యకలాపాలపై అధికారుల నిఘా ఏదీ?

○అక్రమమైతే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్.




దమ్మపేట అక్టోబర్ 9 (జనం సాక్షి):

దమ్మపేట మండల పరిధిలో అర్ధరాత్రి వేళ మట్టి తవ్వకాలు,తరలింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.రాత్రి వేళల్లో మట్టి తరలింపు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయన్న సమాచారంతో,ఈ వ్యవహారంపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాత్రివేళల్లోనే ఎందుకు?**

మట్టి తవ్వకాలు,తరలింపులకు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనుమతించిన పరిమితుల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయా? ఏ ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లయితే వాటిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

రెవెన్యూ, మైనింగ్ తదితర సంబంధిత శాఖల అధికారులు మండల పరిధిలో జరుగుతున్న మట్టి తవ్వకాలు, రవాణాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రివేళల్లో జరిగే తవ్వకాలు, వాహనాల రాకపోకలపై నిఘా ఉంచి, అనుమతులు మరియు రవాణా పత్రాలను తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.

**అక్రమ తవ్వకాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలి**

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు లేదా తరలింపులు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, పర్యావరణానికి హాని జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.దమ్మపేట మండలంలో మట్టి తవ్వకాలు, తరలింపులకు సంబంధించిన వాస్తవాలను అధికారులు వెలుగులోకి తీసుకువస్తారా? అనుమతులపై తనిఖీలు నిర్వహిస్తారా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి.

## ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవాలి

### సర్పంచ్ అరూరి నరేష్ పిలుపు



**మాదుగులపల్లి అక్టోబర్ 9 ( జనంసాక్షి):** మాదుగులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ బాధ్యతగా తమ ఇళ్ల ముందు ఇంకుడు గుంతల (సోక్ పిట్స్) నిర్మాణానికి ముందుకు రావాలని స్థానిక సర్పంచ్ అరూరి నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు గ్రామంలో వర్షపు నీరు, వినియోగించిన నీరు రోడ్లపైకి వచ్చి చేరకుండా, భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు స్థలాన్ని కేటాయించి ఇంకుడు గుంత తవ్వుకునే ప్రయత్నం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి తప్పకుండా బడ్జెట్ విడుదలవుతుంది అందువల్ల గ్రామాభివృద్ధిని, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ముందస్తుగా ఈ గుంతలను తవ్వుకోవాలి అని కోరారు మాదుగులపల్లిని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులందరూ సహకరించాలని, ప్రతి ఇల్లు పరిశుభ్రతకు వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు.

## మంత్రి ఉత్తమ్ ను కలిసిన వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ

**నేరేడుచర్ల అక్టోబర్ 9 (జనంసాక్షి):** నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం హైదరాబాద్ లో భారీ నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు చలసాని శ్రీనివాస్ నూతన పాలకవర్గం కమిటీని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పరిచయం చేశారు. నూతన కమిటీ కష్టపడి పని చేసి రైతులకు సేవ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు అనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు అందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఈ కార్యక్రమంలో నూతన పాలకవర్గ చైర్ పర్సన్ రంగినేని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు పార్టీ నాయకులు కౌన్సిలర్లు బొలిశెట్టి లక్ష్మయ్య తాళ్ల సురేష్ రెడ్డి, అలక శ్రావణ్ రెడ్డి వల్లంశట్ల రమేష్ బాబు, బచ్చలకూరి ప్రకాష్, యారవ శ్రీనివాస్, కల్లూరు సర్పంచ్ చలసాని మంజుల, ఇంజమూరి శ్రీకాంత్, శ్రీను కత్తి శ్రీనివాస్ రెడ్డి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు






## సన్ షైన్ పాఠశాలలో బతుకమ్మ ఉత్సవాలు

**చందూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి)** చందూరు మున్సిపాలిటీ లోని సన్ షైన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులు సేకరించిన వివిధ రకాల పూలను అందంగా బతుకమ్మల రూపంలో పేర్చి పాఠశాల డైరెక్టర్ కోడి సుమ్మ, ఉపాధ్యాయురాళ్ళు, విద్యార్థినులు అందరూ కలిసి బతుకమ్మల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహకరమైన ఆనందోత్సవ వాతావరణంలో బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ.. తొమ్మిది రోజులు బతుకమ్మలను ఏ విధంగా నిర్వహిస్తారు, ఒక్కొక్క రోజు బతుకమ్మకు గల పేర్లను వివరిస్తూ.. బతుకమ్మ విశిష్టతను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో ఐదు అడుగుల బతుకమ్మను పేర్చిన విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, వైస్ ప్రిన్సిపాల్ వినయ్, బతుకమ్మ నిర్వాహకులు రమేష్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం బహూకరణ

**నేరేడుచర్ల అక్టోబర్ 09 (జనంసాక్షి) :** మండలంలోని పెంచికలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ చేశారు.అమెరికాలో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థి నాయిని సైదులు తాను చదువుకున్న పాఠశాలపై ప్రేమతో సుమారు రూ.80 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫాంలను అందజేశారు. వీటిని ఆయన తల్లిదండ్రులు నాయిని సోమయ్య, సైదమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింగ్ చిన్న సోములు మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన ఐదుగురు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు నాయిని సైదులు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకొచ్చారని తెలిపారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు వల్లంశెట్ల లచ్చయ్య, మాజీ సర్పంచ్ మర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన ఉన్నతి సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ మహిళా డిగ్రీ కళాశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉన్నతి సాఫ్ట్ స్కిల్స్, ప్లేస్‌మెంట్ శిక్షణ విజయవంతంగా ముగిసింది. చివరి సంవత్సరం చదువుతున్న 80 మంది క్యాడెట్లు ఈ శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో కోర్సు కోఆర్డినేటర్, ట్రైనర్ పసుల ప్రియాంక విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, సమాచార నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఎల్. సుజాత, ఎస్. సునీత ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లను కళాశాల డైరెక్టర్ కల్నల్ రాజా దత్తా (రిటైర్డ్), ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీలత అభినందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

### ఆధునిక సాగు పద్ధతులతో పత్తిలో

## అధిక దిగుబడులు సాధించాలి

### మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవ రెడ్డి



**గుర్రంపోడు: అక్టోబర్ 09 (జనంసాక్షి)** పత్తి సాగులో అధిక సాంద్రత నాట్ల పద్ధతి, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవ రెడ్డి సూచించారు. గుర్రంపోడు రైతు వేదికలో రైతులకు ఆధునిక పత్తి సాగు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు.తక్కువ కాలంలో చేతికి వచ్చే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. నేలలో తేమను కాపాడేందుకు పంట అవశేషాలతో కప్పు ఏర్పాటు చేయడం, అవసరమైన మేరకు నీటిని అందించడం, వర్షపు నీటిని సంరక్షించడం, చీడపీడలను సకాలంలో నివారించడం ద్వారా పంట దిగుబడిని పెంచుకోవచ్చని సూచించారు.కార్యక్రమంలో విస్తరణ అధికారులు రామాంజనేయులు, గౌతమి, మనోజ్, జ్యోత్స్న, ధరణి, నేతాజీ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 09 (జనంసాక్షి ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి(సాగర్) మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి కోన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతిని, పూలను పూజించే విశిష్టమైన సంస్కృతి తెలంగాణలో ఉందని, అందులో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలుసుకుని వాటిని గౌరవించాలని సూచించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలు, శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఉత్తమంగా



రూపొందించిన బతుకమ్మలకు మండల విద్యాధికారి శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అమృతయ్య, బి. జార్జి, అనితాదేవి, సరోజినీదేవి, గౌస్య, మేరావత్ భాను, లక్ష్మీరామ్, శైలజ, సాయిబాబు, కుమారస్వామి, రాములు, స్వర్ణరేఖ, అభినయ్, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, జానీ భాష, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాంపురం ప్రధానోపాధ్యాయుడు ఫరీద్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నాగమణి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, నాట్కో ట్రస్ట్ వాలంటీర్ జ్యోతి, పద్మ, శైలజ, కాశమ్మ, బిక్షంరెడ్డి, గిరిజతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల్లో ఎంపీడీవో తనిఖీలు

### అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి : ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని పలు గ్రామపంచాయతీలను తిరుమలగిరి (సాగర్) మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని కీచ్య తండా, తునికినూతల, గరికినేటి తండా గ్రామపంచాయతీలను ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, పంచాయతీ రికార్డుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పారిశు ధ్య పరిస్థితులు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.గ్రామపంచాయతీల పరిధిలో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.



గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ తనిఖీల్లో గరికినేటి తండా సర్పంచ్ బాలు నాయక్, పంచాయతీ కార్యదర్శి మధు, కీచ్య తండా, తునికినూతల పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేశాల గడువు పొడిగింపు

**ఖమ్మం, అక్టోబర్ 9 జనంసాక్షి**

నగరంలోని ఎస్.ఆర్ బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్ లో యూజీ, పీజీ, డిప్లొమా సర్టిఫికేట్ కోర్సులకు సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ అక్టోబర్ 13 వ తేదీ వరకు పొడిగించారని ,ఇదే చివరి అవకాశమని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ప్రాంతీయ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డా.జి వీరన్నఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.2026-27 విద్యా సంవత్సరానికి కొత్త గా ఎం.ఎస్సీ. కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయనివెల్లడించారు.అదేవిధంగా, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం మరియు పీజీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజులను సకాలంలో చెల్లించాలని వెల్లడించారు.మరిన్ని వివరాలకు కళాశాలలోని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్టడీ సెంటర్ యందు సంప్రదించాలని సూచించారు.



# సర్వజ్ఞ క్యాంపస్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**ఖమ్మం (జనంసాక్షి):**

నగరంలోని వీడీవోస్ కాలనీలో గల సర్వజ్ఞ సూపర్ కిడ్జ్ క్యాంపస్‌లో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ వస్త్రధారణతో విచ్చేసిన మహిళలు, రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ చేరి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సంబరాల్లో సర్వజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక అని కొనియాడారు. ప్రకృతిని పూజిస్తూ పూలను ఆరాధించడం, మహిళల ఐక్యతను చాటిచెప్పడం ఈ పండుగ ప్రత్యేకతని వివరించారు. అలాగే చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ ధర్మం, సత్యం వైపే విజయం ఉంటుందనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. పాఠశాల దశ నుంచే ఇలాంటి పండుగలను ఘనంగా నిర్వహించడం వల్ల చిన్నారులకు ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహనతో పాటు గౌరవభావం పెరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం, ఉపాధ్యాయుల సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా ముగిశాయి.

### పాపాయిగూడెం పాఠశాలకు

# పూర్వ విద్యార్థి ఆర్థిక సాయం

### విద్యార్థుల కోసం వాటర్ ఫిల్టర్‌కు రూ.3 వేల విరాళం

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 9 (జనంసాక్షి)**

తిరుమలాయపాలెం మండలం లోని పిండిప్రోలు గ్రామపంచాయతీ శివారు పాపాయిగూడెం ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి ఉప్పెర్ల వాసు తన ఉదారతను చాటుకున్నారు. తాను విద్యనభ్యసించిన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ఫిల్టర్ కొనుగోలు కోసం తన సొంత ఖర్చులతో రూ.3,000 విరాళంగా అందజేశారు.తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో వాసు ఈ ఆర్థిక సహాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఆనంద్ బాబు, ఉపాధ్యాయులు వై. నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైన పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ విద్యార్థి

**పెనుబల్లి అక్టోబర్ 9 ( జనంసాక్షి)**



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెనుబల్లి మండలం వి ఎం బంజర పీఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ విద్యార్థి మంచాల గౌతం అర్హత సాధించాడు. వి ఎం బంజర గ్రామానికి చెందిన మంచాల గౌతమ్ సన్నాఫ్ ప్రభాకర్ ఈనెల 11న కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జరగబోయే అండర్ 14 విభాగంలో 60 మీటర్లు, లాంగ్ జంప్ లో ఆడనున్నాడు. శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గౌతమ్ ను ప్రధానోపాధ్యాయులు ఎస్ సత్యనారాయణ , పాఠశాల ఇంచార్జి భాస్కరరావు, అధ్యాపకులు, రైతు కూలీ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ బండి రాము తదితరులు సన్మానించారు.



### పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు

# వెంటనే చెల్లించాలి

○ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

○పీఆర్సీ అమలుతో పాటు ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి

**చంద్రుగొండ, అక్టోబర్ 9 (జనంసాక్షి):**

తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల ద్వితీయ జిల్లా కార్యవర్గ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాల (డీఏ)ను వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రూ.398 వేతనంపై పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఈ.జి.ఆర్. వెస్లీ, కార్యదర్శి ఎం. కోటేశ్వరరావు, కోశాధికారి జి. వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సి.ఎస్. చౌదరి పాల్గొన్నారు.అశ్వారావుపేట, భద్రాచలం, చుంచుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, బూర్గంపాడు, మణుగూరు, ఎల్.డి.పల్లి, దమ్మపేట, చంద్రుగొండ యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు అంశాలపై సమావేశంలో చర్చించారు.

### జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనకు

# ఖమ్మం విద్యార్థిని ఎంపిక

### ‘ఫుట్‌ప్రెస్ న్యుమాటిక్ లిఫ్టర్ జాక్’ ప్రాజెక్టు రూపకల్పన

### అన్వితను అభినందించిన పాఠశాల యాజమాన్యం

**ఖమ్మం , ఖమ్మం కార్పొరేషన్ (జనంసాక్షి):**

న్యూఢిల్లీలో నిర్వహించనున్న 12వ జాతీయ స్థాయి సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శన పోటీలకు నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని సి.హెచ్.అన్విత ఎంపికైంది. సామాజిక సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి రూపొందించిన ‘ఫుట్‌ప్రెస్ న్యుమాటిక్ లిఫ్టర్ జాక్’ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. ఇన్‌స్పైర్ మానక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్విత విజేతగా నిలిచిందన్నారు. వరంగల్ నిట్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఎన్ఐఎఫ్ ఇన్‌స్పైర్ మానక్ నుంచి ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు న్యూఢిల్లీలో జరగనున్న 12వ జాతీయ స్థాయి పోటీలకు ఖమ్మం జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ప్రాజెక్టు ఇదేనని పేర్కొన్నారు. విద్య సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడినప్పుడే సమాజం, దేశం వేగంగా అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగానే తమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నామని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ.. విద్యార్థులకు అనుభవపూర్వక, కృత్యాధార బోధనతో పాటు ప్రయోగాత్మకంగా ఆలోచించేలా శిక్షణ ఇవ్వడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. అన్విత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణలో ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం ముందడుగు

### తిరుమలాయిపాలెం రిజర్వ్ ఫారెస్ట్‌లో సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమం విజయవంతం

**తిరుమలాయపాలెం అక్టోబర్ 9 (జనంసాక్షి) :**

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపు మేరకు లక్ష సీడ్ బాల్స్ తయారీ లక్ష్యంతో, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీతో పాటు వాటిని అటవీ ప్రాంతాల్లో విస్తరించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షులు శ్రీ బొమ్మగాని నరసింహారావు ఆధ్వర్యం లో తయారు చేసిన సీడ్ బాల్స్‌ను ఖమ్మం జిల్లా తిరుమలాయిపాలెం మండలంలోని పులి గుట్ట రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో విస్తరించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జడ్ పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి , పాఠశాల సైన్స్ టీచర్, సోషల్ టీచర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కూసుమంచి ఫారెస్ట్ రేంజ్ అధికారి పి. శ్రీనివాసరావు, డీఆర్ఓ శ్రీ కె.వి. రామారావు గారు, నేలకొండపల్లి ఎఫ్ఎస్ఓ డేనియల్ , ఎఫ్‌బీఓ ఎ. వెంకటేశ్వర్లు, అటవీ శాఖ సిబ్బంది సహకరించారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ, జీవవైవిధ్య పరిరక్షణలో సీడ్ బాల్స్ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేశారు.ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నిర్దేశించిన లక్ష సీడ్ బాల్స్ తయారీ లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు, తయారు చేసిన సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతాల్లో విస్తరించే కార్యక్రమాలను కూడా వేగవంతంగా నిర్వహిస్తున్న ఇండియన్ కామన్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షులు శ్రీ బొమ్మగాని నరిసింహారావు గారికి, క్లబ్ సభ్యులందరికీ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజన్-3 ప్రాంతీయ అధ్యక్షులు మహమ్మద్ నవాబ్ పాషా గారు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడటం, పచ్చదనాన్ని



పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# ఐదు దశాబ్దాల తర్వాత ఒక్కచోట చేరిన బాల్య మిత్రులు!

- 50 ఏళ్ల నాటి మధుర జ్ఞాపకాల నెమరువేత.. గురువుకు ఘన సత్కారం
- తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.25 వేల విరాళం



చంద్రుగొండ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): కాలం ఐదు దశాబ్దాలు గడిచినా.. చెదరని స్నేహబంధం! వయసు అరవై ఏళ్లు దాటినా.. బాల్యపు జ్ఞాపకాలు పదిలం! అక్షరాలు నేర్పిన గురువులు, విద్యాబుద్ధులు అందించిన పాఠశాల, కలిసి చదువుకున్న నాటి మిత్రులు.. ఇలా ఎన్నో మధురానుభూతులను మనసారా గుర్తుచేసుకుంటూ చంద్రుగొండ ఉన్నత పాఠశాలలో 1976?77 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఐదు దశాబ్దాల అనంతరం ఒక్కచోట చేరారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, తమ జీవిత ప్రయాణంలోని అనుభవాలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు.

**గురువుల పాఠాలు.. మళ్లీ విద్యార్థులైన మిత్రులు!**

చిన్ననాటి అల్లర్లు, తరగతి గది సరదాలు, ఉపాధ్యాయుల బోధనలు, పాఠశాల ప్రాంగణంలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. విద్యార్థులుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకుంటూ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు సత్తెనపల్లి నరసింహాచారి చేత మరోసారి తెలుగు పాఠం చెప్పించుకున్నారు. ఐదు దశాబ్దాల తర్వాత మళ్లీ విద్యార్థులుగా మారి, తమ గురువు చెప్పిన పాఠాన్ని ఎంతో శ్రద్ధగా ఆలకించడం ఈ సమ్మేళనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అనంతరం తమకు తెలుగు భాషపై మమకారాన్ని పెంపొందించి, విద్యాబుద్ధులు నేర్పిన నరసింహాచారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గురువుల బోధనలు తమ జీవితాలకు పునాదులుగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు. జీవితంలో ఎన్ని ఉన్నత స్థానాలకు చేరుకున్నా, తమ ఎదుగుదలకు మార్గం చూపిన గురువులను, చదువుకున్న పాఠశాలను మరువలేమని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**పాఠశాల అభివృద్ధికి రూ.25 వేల ఆర్థిక సహాయం**

తమ జీవితాలకు బాటలు వేసిన పాఠశాల పట్ల కృతజ్ఞతను మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా రూ.25,000 విరాళాన్ని ప్రధానోపాధ్యాయులు ఉప్పల్ రెడ్డికి అందజేశారు. తమకు విద్యను అందించిన విద్యాలయం పట్ల పూర్వ విద్యార్థులు చూపిన అభిమానం, బాధ్యతాభావం పలువురి ప్రశంసలు అందుకుంది.

**స్నేహానికి వయసుతో పనిలేదు!**

ఐదు దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటూ, తమ కుటుంబాలు, వృత్తులు, జీవితంలో ఎదురైన అనుభవాల గురించి ముచ్చటించుకున్నారు. కాలగమనంలో ఎవరి జీవితాలు వారివైనా, ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న అనుబంధం మాత్రం చెక్కుచెదరలేదని ఈ సమ్మేళనం చాటిచెప్పింది. పాత మిత్రులను మళ్లీ కలుసుకోవడం, గురువును సత్కరించుకోవడం, పాఠశాలకు విరాళం అందించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించాయని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి బి. మధుసూదనరాజు, బి. వెంకటేశ్వర్లు, తాళ్లూరి మధుసూదనరావు సారథ్యం వహించారు. జానకిరాములు, శ్యామల, కళావతి, తులసమ్మ, అరుణ, లక్ష్మి, నీరజ, జ్యోతి, కుక్కడపు రాంబాబు, పిచ్చయ్య, ఆంజనేయశాస్త్రి, వెంకన్నశాస్త్రి, అంజయ్య, ఏశావు, ముస్తఫా, రమాదేవి, సైదులు తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## చంద్రుగొండ మండలంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ పాటలకు ఆడి పాడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు**

చంద్రుగొండ, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని చంద్రుగొండ మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చంద్రుగొండ, సెయింట్ జోసెఫ్ పాఠశాల అయ్యన్నపాలెం, సీపీఎస్ అంబేద్కర్ కాలనీ, పోకలగూడెం తదితర పాఠశాలల్లో విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఒకచోట చేర్చారు. అనంతరం సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, వాటి తాళానికి అనుగుణంగా ఆడి పాడి సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులు ఈ సందర్భంగా చాటిచెప్పారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాలల ప్రాంగణాలు బతుకమ్మ పాటలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

**మృతురాలి భౌతికకాయానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నివాళులు**



ఖమ్మం రూరల్, అక్టోబర్ 9:(జనంసాక్షి) ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో విషాదం చోటుచేసుకుంది. సిపిఐ కార్యకర్త చల్ల ఉపేందర్ భార్య చల్ల కవిత (26) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. చిన్న వయసులోనే ఆమె ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.మృతురాలు కవితకు భర్త ఉపేందర్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## గ్రాడ్యుయేట్ ఓట్ల చేర్పులో బిఆర్ఎస్ అగ్ర భాగంలో ఉండాలి

- మాజీ ఎం ఎల్ ఏ సండ్ర పిలుపు
- బిఆర్ఎస్ లో జోష్ నింపిన సండ్ర



పెనుబల్లి అక్టోబర్ 9 (జనంసాక్షి) గ్రాడ్యుయేట్ ఓట్ల చేర్పులో పెనుబల్లి మండలం బి.ఆర్.ఎస్ పార్టీ అగ్ర భాగంలో ఉండాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పి లుపునిచ్చారు. త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎంఎల్ సి ఎన్నికల సందర్భంగా శుక్రవారం సండ్ర ఆధ్వర్యంలో పెనుబల్లి మండలం వివిఎం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ లో మండల పార్టీ తో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ నాయకత్వాన్ని సన్నద్ధం చేసేందుకు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై సండ్ర దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ మండలంలో బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై చాలా బలంగా పనిచేస్తుందని అన్నారు, బి ఆర్ఎస్ పార్టీ వాణి ప్రజల్లో బలంగా వినిపిస్తుందని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం తథ్యమని పార్టీ నాయకుల్లో కార్యకర్తల్లో జోష్ నింపారు. ఓట్ల చేర్పులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ బి ఆర్ ఎస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## ఎం ఎల్ ఏ చొరవతో విద్యుత్ దీర్ఘకాల సమస్యల పరిష్కారం దిశగా

పెనుబల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి) స్వతహాగా సేవాభావం ఉన్న తన తండ్రి నమ్ముకున్న పార్టీపై మమకారంతో తండ్రి బాటలో నడిచేందుకు ఓ యువకుడు ఊరి సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఎం ఎల్ ఏ డాక్టర్ మట్టా రాగమయి సహకారంతో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నాడు. పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అభిమాని అన్నపురెడ్డి శ్రీనివాసరావు తన తండ్రి అన్నపరెడ్డి సుంకయ్య రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, కాంగ్రెస్ పార్టీ అభిమాని, పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలు చేశారు, పెనుబల్లిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, రాజకీయవేత్త,డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ఏర్పాటులో తన వంతు కృషి చేశారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతి చెందారు, అనంతరం కొడుకు శ్రీనివాస్ ఎం.ఎల్.ఎ రాగ మయి,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు దయానంద్ ల పై అభిమానంతో కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో పార్టీలో పని చేస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన వంతుగా ఊరి సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే క్రమంలో గ్రామంలో విద్యుత్ దీర్ఘకాలిక సమస్యలపై రాగమయి దృష్టికి తీసుకువెళ్లడంజరిగింది, ఆమె స్పందించి విద్యుత్తు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం పెనుబల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రామంలో పాడైపోయిన విద్యుత్ ఇనుప స్తంభాలను,ఇతర విద్యుత్ సమస్యలను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శ్రీ చైతన్య లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 9 (జనం సాక్షి ) శ్రీ చైతన్య పాఠశాల, మామిళ్లగూడెం శాఖలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు, ప్రకృతిని ప్రేమించడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. నీరజ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, కోఆర్డినేటర్లు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కల్యాణి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# త్రివేణి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిన విద్యార్థులు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
త్రివేణి పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, గౌరవం పెంపొందుతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకొని, వాటిని భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ పాటలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.









## వాసవి క్లబ్ చంద్రుగొండకు
# రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు

### ఉత్తమ సేవా సంఘంగా, ఉత్తమ అధ్యక్షుడిగా గుర్తింపు

**చంద్రుగొండ, అక్టోబర్ 9 (జనంసాక్షి):**
వాసవి క్లబ్ చంద్రుగొండకు రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. వాసవి క్లబ్బుల అంతర్జాతీయ సంస్థ, జిల్లా 106ఏ, ప్రాంతం మూడు, మండలం ఒకటి ఆధ్వర్యంలో ఈ నెల 7న సుజాతనగర్‌లో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమంలో చంద్రుగొండ వాసవి క్లబ్‌కు ఉత్తమ సేవా సంఘం, క్లబ్ అధ్యక్షుడు కుక్కడపు నాగేశ్వరరావుకు ఉత్తమ అధ్యక్షుడి పురస్కారాలు లభించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాసవి క్లబ్బుల అంతర్జాతీయ సంచాలకుడు గుమ్మడవెల్లి శ్రీనివాస్, పరిశీలకుడు గెల్లా కృష్ణారావు, మండల అధ్యక్షుడు శీమకుర్తి నాగరాజ్ తరుణ్ చేతుల మీదుగా క్లబ్ ప్రతినిధులు పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజ్ తరుణ్ మాట్లాడుతూ, ఏడాది కాలంగా చంద్రుగొండ వాసవి క్లబ్ నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. సమాజ సేవలో క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు కుక్కడపు నాగేశ్వరరావు సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రెండు పురస్కారాలు లభించడం పట్ల క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

# నూతన సీఐకి ఐరన్ అసోసియేషన్ ప్రతినిధుల ఘన స్వాగతం

### శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తాం

**భద్రాచలం అక్టోబరు 09 (జనంసాక్షి)**
భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను భద్రాచలం ఐరన్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐకు శాలువా కప్పి, పూలగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు పోలీసు శాఖ చేపట్టే కార్యక్రమాలకు ఐరన్ అసోసియేషన్ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐరన్ అసోసియేషన్ ప్రముఖులు చారుగుళ్ల నాగభూషణం, కొండిశెట్టి సత్యనారాయణ, పద్మా వెంకట్, శ్రీదేవి ఐరన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చిట్టి చిట్టి చేతులతో మురిసిన బతుకమ్మ

### పెంట్లం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

### కోలాటాలతో చిన్నారుల సందడి

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు పాఠశాలలో ముందస్తుగా అంబరాన్నంటాయి. మండల పరిధిలోని పెంట్లం యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రంగురంగుల దుస్తులతో అందంగా ముస్తాబై, తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పండుగ సందడిని తీసుకొచ్చారు. చిట్టి చిట్టి చేతులతో ఒక్కో పువ్వును పేర్చి బతుకమ్మలను అందంగా అలంకరించిన విద్యార్థినులు, కోలాట నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూల పరిమళాలు, చిన్నారుల ఆటపాటలు, కోలాటాల సందడితో పాఠశాల ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాయి. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ఉత్సాహం, బతుకమ్మల అందాలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.





# తెలంగాణ నియంతృత్వ పాలనకు నిదర్శనం

### ○ కుటుంబ పాలన - అన్నదమ్ముల పాలన ○ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్

**టేకులపల్లి,అక్టోబర్ 9(జనంసాక్షి):**
ఆరుదశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ పోరాటాలు చేసి, అనన్య త్యాగాల ఫలితంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రం ఎన్నో ఆశలతో, మరెన్నో ఆశయాలతో ముందుకు సాగుతూ బంగారు తెలంగాణగా బాటలు పడాల్సిన తెలంగాణ నియంతృత్వ దొరల పాలనలతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను అధోగతి పాలు చేశారని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని 17వ ఆవిర్భావం అక్టోబర్ 10 న జరుపుకుంటుంది. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత ఉద్యమం పార్టీగా చెప్పుకునే అధికారం చేపట్టిన అప్పటి టిఆర్ఎస్, ప్రస్తుతపు బిఆర్ఎస్ పార్టీ పదేళ్లు అధికారం నేరపి కుటుంబ పాలనతో ప్రజల ఆశలను ఆకాంక్షలను ఒమ్ము చేసిందన్నారు. వోట్ల రాజకీయంలో ప్రజలే మళ్లీ మళ్లీ ఓడ పోతున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణలో ఉద్యమ నినాదాలేవీ నెరవేరకపోగా రాష్ట్రం కెసిఆర్ కుటుంబ రాజ్యంగా మారి పోయింది. అవినీతి, వ్యక్తివాద పోకడలు మితిమీరి నియంతృత్వం పెచ్చరిల్లి పోయింది. ఈ నేపథ్యంలోంచే తెలంగాణ ప్రజలు నియంతృత్వ దొరతనాన్ని అసహ్యిం చుకొని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. రేవంత్ రెడ్డి అధికారం చేజిక్కించుకొని తనది ప్రజా పాలనగా చెప్పుకున్నాడు. అవినీతికి - తావులేని నియంతృత్వ పోకడలు పోకుండా జనరంజక పాలన - అందిస్తానని హామీ పడిన రేవంత్ రెడ్డి గత పాలకుల అడుగుల్లోనే అడుగు లేస్తున్నాడు. కెసిఆర్ కొడుకు, బిడ్డ, అల్లుళ్లతో కుటుంబ పాలన సాగిస్తే, రేవంత్ రెడ్డి అన్నదమ్ముళ్ల పాలన కొనసాగిస్తూ నియంత పోకడలతో ప్రజలకు ఒరిగేదేమీ లేకుండా రాజ్యమేలు తున్నారని ఆయన విమర్శించారు. కెసిఆర్ నెలల తరబడి సెక్రెటేరియట్ కు రాకుండా ఫాం హౌస్ నుంచే పాలన సాగించాడు. ఒకరిద్దరు కోటరీకి తప్ప ఎవరికీ అందు బాటులో ఉండేవాడు కాదని, చివరికి కేబినెట్ మంత్రులు కూడా నెలల తరబడి సిఎంను కలువటం కోసం ఎదురు చూసే దుస్థితి ఉండేదంటే, ఇక సామాన్యులు తమ సమస్య లను వెళ్లబోసుకోదడానికి - తావెక్కడిది? ఒక రకంగా గత ప్రభుత్వ పాలన ప్రజా స్వామ్య పాలన కాదు, రాచరిక పాలనగా ప్రజలు గమనించి అనుభవించా రన్నారు. సరిగ్గా రేవంత్ పాలన కూడా అదే రీతిలో నడుస్తున్నదనే భావన సర్వత్రా వినిపిస్తున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం నెలల తరబడి సిఎంను కలిసేందుకు అవకాశం దొరకటం లేదు. ప్రజా ప్రతినిధు లను కలిసేందుకు అవకాశం ఇవ్వలేని రీతిలో ఏం పని ఉంటుందని నేతలే ఆక్రోశిస్తున్న స్థితి ఉన్నది. పోరాటాలకూ, త్యాగాలకూ పెట్టింది పేరైన తెలంగాణ, - చైతన్యానికీ ప్రతీక. ఆ నేపథ్యం లోంచే ప్రపంచాన్నంతా ఒకే మార్కెట్గా చూసే ప్రపంచీకరణ యుగంలో కూడా పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారు. పాలకుల చిరునామాలు మాత్రమే మారే వోట్ల - రాజకీయంలో ప్రజలు మరొకసారి దగాపడ్డారు. పాలకులు ఎవరైనా ఆ ఒకే తాను గుడ్డలుగా పాలన అంతా ఒకేతీరుగా ఉండటం పట్ల - తెలంగాణ ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం దిశగా ఆలోచనలు సాగాలి. పాలక పార్టీల ఆ గొడవ, కొట్లాట అంతా అధికారం కోసమే కాని, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కాదనేదీని మనం అర్థంచేసుకోవాలి. రాజకీయ చైతన్యంతో కూడిన ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే భౌగోళిక తెలంగాణలో ప్రజాస్వామ్య తెలంగాణను చూడగలుగుతామని ఆయన అభిప్రాయపడ్డారు.



# రంగుల రమణీయం.. దసరా సంబురం

- న్యూఇరా విద్యాసంస్థలో అంబరాన్నంటిన వేడుకలు
- బతుకమ్మ ఆటపాటలు.. సాంప్రదాయ నృత్యాలతో సందడి

**ఖమ్మం, (జనంసాక్షి) :**
రంగురంగుల పూల బతుకమ్మలు.. లయబద్ధమైన చప్పట్లు.. శ్రీరాముని విజయగాథను కళ్లకు కట్టిన ప్రదర్శనలతో స్థానిక మమత హాస్పిటల్ రోడ్డు, రాధాకృష్ణ నగర్‌లోని 'న్యూఇరా హైస్కూల్' ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. పాఠశాలలో దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన విద్యార్థుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక:**

**చైర్మన్ ఐ.వి. రమణారావు**

ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల చైర్మన్ ఐ.వి. రమణారావు విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలు, వాహన పూజ, రావణాసుర దహనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అన్నారు. రావణ సంహార ఘట్టం ద్వారా సమాజంలోని అహంకారం, దురాశ, అసూయ, ద్వేషం వంటి అవలక్షణాలను విడిచిపెట్టి సత్యం, ధర్మం, సన్మార్గంలో నడవాలనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. న్యూఇరా విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ పాఠశాలకు వన్నె తెస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లోని నిగూఢ ప్రతిభను వెలికితీసేందుకు




ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో పాఠశాలల పాత్ర కీలకం: డైరెక్టర్ డా. పి. భూమేశ్వర్రావు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వర్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఐకమత్య భావనను పెంపొందించడంలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. భావి తరాలకు మన సనాతన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చేరవేయడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటలకు విద్యార్థినులు లయబద్ధంగా ఆడిపాడగా, శ్రీరాముని విజయగాథను ప్రతిబింబించే నాటికలు, సంప్రదాయ నృత్యాలు అందరినీ కట్టిపడేశాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉత్సవంతో పాఠశాల ప్రాంగణమంతా విజయదశమి పండుగ ఉత్సాహంతో మురిసిపోయింది.






## చింతకాని పాతర్లపాడు కాలనీ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**చింతకాని , అక్టోబర్ 09 (జనంసాక్షి)**
చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు కాలనీ పాఠశాలలో దసరా సెలవుల సందర్భంగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించే పూల పండుగ అని అన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల సిబ్బంది కుమారి, సావిత్రమ్మ, కృపమ్మ, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ, ఆయా వెంకటలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐ పై ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు



**మాడ్గులపల్లి అక్టోబర్ 9 (జనంసాక్షి):** మాడ్గులపల్లి ఎస్ఐ నిందితుడికి కొమ్ము కాస్తూ, తమపై అక్రమ కేసులు బనాయించారని నల్గొండ జిల్లా ఎస్పీకి గజలపురం రైతు గార్లపాటి పుష్పలత ఫిర్యాదు చేశారు. తనకు చెందిన 4 ఎకరాల పొలంలో గత 30 ఏళ్లుగా ఉన్న వ్యవసాయ బోర్లను పక్క పొలం రైతు నల్లబోతు సిద్ధార్థ రెడ్డి ధ్వంసం చేశాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని తెలిపారు పైగా నిందితుడితో కలిసి తమపై, స్థానిక మాజీ సర్పంచ్ పోలగాని కృష్ణయ్య మరికొందరిపై అక్రమంగా కేసు (అతీ.ఔనీ: 129/2026) నమోదు చేశారని ఆరోపించారు రెవెన్యూ రికార్డుల ప్రకారం బోర్లు తమ భూమిలోనే ఉన్నాయని ఆర్.టి.ఐ ద్వారా స్పష్టమైనా ఎస్ఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## వేంకటేశుని దివ్య మందిర భూమిపూజకు రారండి

**42వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించిన మాజీ కార్పొరేటర్ విజయనిర్మల**



**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఖమ్మం నగర ప్రజల చిరకాల స్వప్నం సాకారం కాబోతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య మందిర శంకుస్థాపన మహోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ చరిత్రాత్మక ఘట్టానికి భక్తులను ఆహ్వానిస్తూ 42వ డివిజన్‌లో గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మాజీ కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల శేషగిరి ఆధ్వర్యంలో నాయకులు డివిజన్‌లోని ప్రతి ఇంటి గడప తొక్కి కాలనీవాసులను కుటుంబ సమేతంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాకలపాటి విజయనిర్మల మాట్లాడుతూ.. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, త్రిదండి రామానుజ జీయర్ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామివారి దివ్య మార్గదర్శకత్వంలో, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ నెల 12వ తేదీ (సోమవారం) ఉదయం 9:30 గంటలకు భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరగనుందని తెలిపారు. ఖమ్మం చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ పవిత్ర మహోత్సవానికి నగరవాసులు, భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీనివాసుని కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఈ దివ్య మందిర నిర్మాణం పరిపూర్ణమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రికలు అందజేసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు గౌస్, షాదీఖానా డైరెక్టర్ సమద్ భాయ్, ముఖ్య నాయకులు రమాదేవి, పర్వీన్, వెంకటరమణ, షహీన్, షమీం తదితరులు ఉన్నారు.

### స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం (గుట్ట) ఆధ్వర్యంలో..

## జమ్మిబండలో శరన్నవరాత్రుల వైభవం!



దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి కమిటీ, భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో పది రోజుల ఉత్సవాలు రోజుకో అలంకారం.. నిత్యం విశేష పూజలు.. 17న అన్నపూర్ణాదేవి అలంకరణతో అన్న ప్రసాద వితరణ విజయదశమి వేళ గుట్ట నుంచి జమ్మిబండకు లక్ష్మీనరసింహ స్వామివారు.. భక్తుల సమక్షంలో శమీపూజ మహోత్సవం

**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఖమ్మం నగరంలో భక్తి భావం వెల్లివిరియనుంది. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడనుంది. అమ్మవారి దివ్య అలంకరణలు, విశేష పూజలు, భక్తజనుల ఆరాధనలతో జమ్మిబండ పుణ్యవేదికగా ముస్తాబు కానుంది. దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అక్టోబరు 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, శ్రీ స్వామివారి భక్త బృందం సంయుక్తంగా ఉత్సవాలను నిర్వహించనున్నారు.

**నవరాత్రుల వేళ.. అమ్మవారి దివ్య అలంకారాలు**

నవరాత్రుల ప్రతి రోజూ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే పూజలు, కుంకుమార్చనలు, హారతులతో ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణం నెలకొననుంది. అమ్మవారి వివిధ రూపాలను దర్శించుకొని భక్తులు ఆధ్యాత్మికానందాన్ని పొందేలా కార్యక్రమాలను రూపొందించారు. భక్తుల భాగస్వామ్యంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు.

**అన్నపూర్ణాదేవి అలంకరణ..**

అక్టోబరు 17న అన్నపూర్ణాదేవి అలంకరణ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**విజయదశమి వేడుకలకు వైభవోపేత ఏర్పాట్లు**

ఉత్సవాల ముగింపు ఘట్టమైన విజయదశమి పర్వదినాన ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. అక్టోబరు 20న సాయంత్రం 6.30 గంటలకు గుట్ట నుంచి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు జమ్మిబండకు విచ్చేయనున్నారు. ముఖ్య అతిథులు, ఆహ్వానితులు, భక్తుల సమక్షంలో శమీపూజను వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. దేవీ నవరాత్రుల పవిత్రతను చాటుతూ, విజయదశమి ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి, స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.



# ఉద్యమకారుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది

- తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ ధ్వజం
- మూడేళ్లు గడిచినా నెరవేరని ఎన్నికల వాగ్దానాలు
- కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారు
- ఝార్ఖండ్ తరహాలోనే నెలకు ?25 వేల పింఛన్, హెల్త్ కార్డులు ఇవ్వాలి
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడైనా ఉద్యమకారులను గౌరవించాలి

**చౌటుప్పల్ అక్టోబర్ 09(జనంసాక్షి)**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా వంచించిందని తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎన్నికల మేనిఫెస్టోలో అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, 250 గజాల ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. నేటికీ వాటిని అమలు చేయకుండా మోసపూరితమైన వాగ్దానాలుగా మిగిల్చిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత లేని కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ, సమావేశాల సాకుతో ఉద్యమకారుల సమస్యలను సాగదీస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కొంతమంది ఉద్యమకారులనైనా గుర్తించి ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, ఆర్థిక సహాయం అందించిందని.. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క ఉద్యమకారుడిని కూడా గుర్తించిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యమకారులు:
తెలంగాణ ఉద్యమంలో అహర్నిశలు శ్రమించిన ఎంతోమంది ఉద్యమకారుల ఆరోగ్యాలు ప్రస్తుతం క్షీణించాయని, ఆర్థిక ఇబ్బందులు తాళలేక రాష్ట్రంలో అక్కడక్కడ ఉద్యమకారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొందని ఉప్పు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కింది డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు:

**ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లు:**
1. నెలకు ?25 వేల పింఛన్: ఝార్ఖండ్ రాష్ట్రం తరహాలోనే తెలంగాణ ఉద్యమకారులకు నెలకు 25 వేల రూపాయల పింఛన్ అందించాలి.
2. హెల్త్ కార్డులు: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యమకారుల కోసం ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేయాలి.
3. ఇంటి స్థలాలు: ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని తక్షణమే కేటాయించాలి.



4. స్వయం ఉపాధి రుణాలు: ఉద్యమకారుల ఉపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా ?50 లక్షల నుండి ?1 కోటి వరకు రుణాలు అందించాలి. 5. కేసుల ఎత్తివేత, త్యాగాల గుర్తింపు: ఉద్యమంలో పాల్గొని జైలు పాలై, భవిష్యత్తును కోల్పోయిన విద్యార్థులు, యువతపై ఉన్న కేసులను పరిగణనలోకి తీసుకుని వారి త్యాగాలను గుర్తించాలి. మిగిలిపోయిన అమరవీరుల కుటుంబాలను గుర్తించి ఉద్యోగ, ఆర్థిక సహాయం అందించాలి. రాబోయే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడైనా ప్రభుత్వం మేల్కొని ఉద్యమకారులను సముచితంగా గౌరవించాలని ఉప్పు కృష్ణ హితవు పలికారు. ఇందుకోసం ప్రభుత్వం తక్షణమే ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఎస్ వి ఎన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

### విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట అక్టోబర్ 9 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్ వి ఎన్ పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బొట్టు పెట్టి ఆయనకు ఘన స్వాగతం పలికారు.
అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీర్ల అయిలయ్య , విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సందడిని పంచుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమైక్యతను పెంపొందిస్తుందని తెలిపారు.
మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతా భావం పెరుగుతాయని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## లారీల నుంచి డీజిల్ చోరీ.. ఒకరి అరెస్ట్

### మరో నలుగురి కోసం పోలీసుల గాలింపు: సీఐ రవి

**వలిగొండ, అక్టోబర్ 9 (జనంసాక్షి )**
పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ చోరీ చేస్తున్న కేసులో సయ్యద్ సోహైల్ (24)ను వలిగొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని సీఐ రవి శుక్రవారం వెల్లడించారు.వలిగొండ, నాగారం పెట్రోల్ బంకుల పరిధిలో లారీల నుంచి డీజిల్ చోరీ జరుగుతోందని ఫిర్యాదులు అందడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వలిగొండ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సోహైల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, సహచరులతో కలిసి చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు తెలిపారు. వలిగొండలో 700 లీటర్లు, నాగారంలో 250 లీటర్ల డీజిల్ అపహరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.నిందితుడి నుంచి రూ.1.70 లక్షల నగదు, బాలెనో కారు, ఇనుప రాడ్, ప్లాస్టిక్ పైపు, 16 క్యాన్లు, మొబైల్ ఫోన్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో సంబంధమున్న మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.



## స్పందన డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని జిల్లా కేంద్రంలోని స్పందన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ బాల్తు సైదారావు అన్నారు.శుక్రవారం స్పందన డిగ్రీ కళాశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ సొంతమని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పూలను పూజిస్తామని తెలిపారు.తెలంగాణ ఆడపడచులు అందరూ సంతోషంగా జరుపుకునే పెద్దపండుగ బతుకమ్మ అన్నారు.బతుకమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు.అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ పాటలను ఆలపిస్తూ ఆడిపాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలి

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 9 (జనంసాక్షి)**



ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని జాజిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న మురుగునీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వదిలి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, బిల్ కలెక్టర్ మాగి నాగయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):**



బీమనపల్లి గ్రామానికి చెందిన మీసాల యాదయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ సౌజన్యంతో మంజూరైన రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును గ్రామ సర్పంచ్ కర్నాటి వరలక్ష్మి పాండు, మీసాల మంజులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బ్యాంకు అందిస్తున్న సేవలు, ప్రమాద బీమా ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు, పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మేనేజర్ రచ్చ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## కోదాడ రూరల్ సీఐ కి అభినందనలు

**కోదాడ( జనంసాక్షి):**
కోదాడ రూరల్ సిఐగా ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన డి రామకృష్ణారెడ్డినిసిఐ ఆఫీస్ లో శుక్రవారం పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సేకు శ్రీనివాసరావు,గోపి రాథోడ్, సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగాఎస్ఎస్ రావు మాట్లాడుతూ కోదాడ రూరల్ పరిధిలో అనేక గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ,గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు.



## జాజిరెడ్డిగూడెంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 9 (జనంసాక్షి)**



జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పల్లె దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం క్షయవ్యాధి నిర్ధారణ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి రావడానికి గల కారణాలు, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఏం. బిచ్చునాయక్, సూపర్ వైజర్ లలిత, మండల టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, హెల్త్ అసిస్టెంట్ శకుంతల, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఆశా కార్యకర్తలు నాగమ్మ, సైదమ్మ, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్కారు బడులలో ఎంగిలి పువ్వు బతుకమ్మ సంబరాలు



**చిలుకూరు,అక్టోబర్ 09 (జనంసాక్షి):** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలను ప్రభుత్వ పాఠశాలలో అత్యంత వైభవంగా ప్రారంభం కానుండటంతో, సెలవులకు ముందే ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు కలిసి ముందస్తు బతుకమ్మ, సద్దుల సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం పి ఎం శ్రీ జిఖఉూ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థినిలు తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను పాఠశాలకు తీసుకొచ్చి బడి ఆవరణలో ఏర్పాటు చేసి బతుకమ్మ పాటలకు చప్పట్లు వేశారు. బతుకమ్మ పాటల కు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, విద్యార్థిని లతో కలసి స్టెప్పులు వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బతుకమ్మ సంబురాలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. బతుకమ్మలను అందంగా తయారు చేసిన విద్యార్థినిలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుమల్లికార్జునరావుశైలజ, సురేష్మమత , అస్మా , కైలాసపు ఏడుకొండలు, రేణుక, సాంసన్, సజ్జన కుమారి, అంకిరెడ్డి, కృష్ణ,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను నిర్మూలించి
# బాలికల విద్యను ప్రోత్సహించాలి

**ఎయిడ్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ ఒగ్గు సోమన్న**

**అనాజిపురం ఆదర్శ పాఠశాలలో బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన**



**పెన్ పహాడ్, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** బాల్యవివాహాలను నిర్మూలించి బాలికల విద్యను ప్రోత్సహించాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఒగ్గు సోమన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ, జస్ట్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి సి పి యు సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి, హుమెన్ ట్రాఫిక్ యూనిట్ సభ్యులు జి విద్యాసాగర్ మాట్లాడుతూ బాలికల భద్రత, రక్షణ, చట్టపరమైన హక్కులు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఎయిడ్ సంస్థ వారు బాల్యవివాహాలను నిర్మూలించి, బాలికల హక్కులను కాపాడుతూ, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, యాంటీ హుమెన్ ట్రాఫికింగ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, డీసీపీయూ సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి, చైల్డ్లైన్ కేస్ వర్కర్ దేశగాని కిరణ్, ఎయిడ్ ఎన్జీవో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ చింతమల్ల సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు, సూర్య గౌడ్, జయంతి ,విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## జీఆర్ వివేకవాణి స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**సూర్యాపేట(జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ అని జీఆర్ వివేకవాణి విద్యా మందిర్ హైస్కూల్ కరస్పాండెంట్ గుడిమళ్ల సంతోష్, ప్రిన్సిపాల్ గుడిమళ్ల స్వప్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల జీఆర్ వివేకవాణి విద్యా మందిర్ హైస్కూల్ లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థినిలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చేసిన కోలాటాలు,నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ సంబరాలని అన్నారు. బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ అని కొనియాడారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తెలంగాణ ఆడపడుచులు అందరూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా సంతోషంగా జరుపుకునే పెద్ద పండుగ బతుకమ్మ అని అన్నారు. విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ పాటల పుస్తక ఆవిష్కరణ

**సూర్యాపేట(జనంసాక్షి):** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే అతి పెద్దపండుగ బతుకమ్మ పండుగ అని శ్రీవాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు,కోశాధికారి సోమా ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు తప్పి గాంధీ, సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బేలిదే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కలకోట లక్ష్మయ్యతో కలిసి బతుకమ్మ పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 9 ఏళ్ల క్రితం వనపర్తికి చెందిన పూరి సురేష్ శెట్టి స్థాపించిన శ్రీవాసవి సేవాసమితి అనే స్వచ్ఛంద సంస్థ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక,సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పుస్తక రూప కల్పనకు సహరించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరశెట్టి సత్యనారాయణ, కలకోట నర్సయ్య, కర్నాటి కృష్ణ, సోమ వెంకటేశ్వర్లు, సోమ సుమన్, బచ్చు శ్రీనివాస్,చల్లా సత్యనారాయణ, నూనె యుగం ధర్ , సోమ శ్రీశైలం,దేవరశెట్టి ఉమారాణి,కలకోట అనిత, లకుమారపు పద్మ, వీరవెల్లి ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాగా సూర్యాపేట ఎంపిక**

**రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట (జనంసాక్షి):** సమాచార హక్కు చట్టం 2005 అమలులో సూర్యాపేట జిల్లా రాష్ట్రస్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందింది. పారదర్శక పాలన, జవాబుదారీతనం, సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలులో చూపిన పనితీరుకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ సూర్యాపేట జిల్లాను ఉత్తమ పని తీరు కనబరిచిన జిల్లాగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు 2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

**పారదర్శక, జవాబుదారీ పాలనకు దక్కిన గుర్తింపు...**

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల సమాచార హక్కును పరిరక్షిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందిం చేందుకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా యంత్రాంగం సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యలు, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా సూర్యాపేట జిల్లాకు ఈ రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

**జిల్లా కలెక్టర్కు అభినందనల వెల్లువ..**

సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా సూర్యాపేట ఎంపిక కావడం పట్ల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, సీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, ఆర్టీఓ పురుషోత్తమ్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు, వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్. అనిల్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, డీఎస్డీఓ వెంకట్ రెడ్డి, డీఐఈఓ సులోచన రాణి, జిల్లా పరిశ్రమల



## నేడు మహాలయ అమావాస్య అన్నదాన కార్యక్రమం

**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట పట్టణంలోని శంకర్ విలాస్ సెంటర్ రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా గత ఐదు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న మహాలయ అమావాస్య అన్నదాన కార్యక్రమంను నేటి మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుమన్ వెంకన్న,గోపారపు రాజు, నరేంద్రుని విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాల నుంచి మహాలయ అమావాస్య అన్నదానాన్ని స్థానిక మిత్రుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఇది తరతరాలు గా వస్తున్నటువంటి కార్యక్రమం అని, మన పూర్వీకులను స్మరించుకుంటూ వారి పేరున అన్నదానం చేస్తే మనకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ కార్యక్రమాన్ని సూర్యాపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లం సురేష్, మొరిశెట్టి రాము, కొండా శ్రీనివాస రావు, బ్లూసీ జాని, సైదులు, సిద్ది శ్రీకాంత్, గుడిపాటి రమేష్, చందా రాజశేఖర్, నరేంద్రుణి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రైతు మహాసభలను జయప్రదం చేయాలి

**సీపీఎం నేత నాగారపు పాండు**



**హుజూర్నగర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు పిలుపునిచ్చారు. శుక్రవారం హుజూర్నగర్ మండల కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ విరాళాలు సేకరించాలని, జన సమీకరణ భారీగా చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, శ్రేయోభిలాషులు ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, చందాల భిక్షం, సిద్దిల వెంకటయ్య, పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, మేగడ రాములు, షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి సతీష్ గౌడ్**

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** విద్యార్థులు క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, అప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని లీడేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, చిన్నారులు విభిన్న వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చి, ఆటపాటలతో అందరినీ అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పసునూరు ప్రభాకర్, పాఠశాల చైర్మన్ కర్నాటి శ్రవణ్ కుమార్, ప్రిన్సిపల్ మాస్టర్ కాశినాథ్, సీత హరిప్రసాద్, ఆర్ల లింగస్వామి యాదవ్, మహమ్మద్ ఆజం, జగన్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రినిటీ హైస్కూల్ వైభవంగా బతుకమ్మ సంబురాలు



**ముఖ్య అతిథిగా హాజరైన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ లక్ష్మి**

**ఆకట్టుకున్న 30 అడుగుల భారీ బతుకమ్మ**

**చౌటుప్పల్, అక్టోబర్ 09 (జనంసాక్షి)**
మున్సిపాలిటీ కేంద్రంలోని ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా, కన్నుల పండుగలా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ పూల పండుగను చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన 30 అడుగుల భారీ బతుకమ్మ ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి విద్యార్థినులు, మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పువ్వులను దేవతలా పూజించే గొప్ప సంస్కృతి ఒక్క తెలంగాణకే ప్రత్యేకమని కొనియాడారు. బతుకమ్మ వేడుకల ద్వారా ఈ తరం పిల్లలకు మన పండుగల గొప్పతనాన్ని, సాంప్రదాయాలను తెలియజేయడం అభినందనీయమన్నారు. మన పూర్వీకులు అందించిన ఈ అద్భుతమైన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులందరూ తమ గ్రామాలకు వెళ్లి, నానమ్మలు, అమ్మమ్మల ద్వారా మన సాంప్రదాయ విశేషాలను తెలుసుకోవాలని ఆమె సూచించారు.

**పేదలకు సేవ చేయడమే మా లక్ష్యం:**
భగవంతుడు ఇచ్చిన శక్తితో, తమ ఊపిరి ఉన్నంతవరకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సమాజానికి, పేద ప్రజలకు నిరంతరం సహాయం చేస్తూనే ఉంటామని లక్ష్మి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ ఘనమైన వేడుకల్లో చౌటుప్పల్ మున్సిపల్ మహిళా పాలకవర్గ సభ్యులు, పుర ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మాడుగులపల్లిలో కోలాహలంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**మాడుగులపల్లి అక్టోబర్ 9 (జనంసాక్షి):**
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం కానుండటంతో, విద్యార్థినులు పాఠశాలల్లోనే ముందస్తు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు రంగురంగుల పూలతో తీరొక్క బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు అనంతరం బతుకమ్మలను స్థానిక నీటి వనరుల్లో నిమజ్జనం చేసి, సద్దుల ప్రసాదాలు పంచుకున్నారు ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, గ్రామ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





## ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలి

**అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ అందించిన పాండన్న**

**గుర్రంపోడు అక్టోబర్ 09 (జనంసాక్షి)**
నల్గొండలోని భవిత ఇన్స్టిట్యూట్‌లో బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాండన్న మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతిరోజూ కష్టపడి చదివి, తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. మెయిన్స్ పరీక్షలకు ఉపయోగపడే విధంగా మెటీరియల్ అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు భవిష్యత్తులో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భవిత ఇన్స్టిట్యూట్ వెంకటరెడ్డి, ఎకనామిక్స్ లెక్చరర్ నరేష్, యడవెల్లి దిలీప్ రెడ్డి, ఐతగోని పరమేష్ గౌడ్, ఓర్సు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పట్టభద్రుల ఓటింగ్ నమోదు ప్రక్రియ కార్యక్రమం

**కోదాడ,( జనం సాక్షి):**



కోదాడ నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో కౌండిన్య గౌడ సంఘం జాతీయ అధ్యక్షులు కేఎల్ఎన్ ప్రసాద్ పిలుపుమేరకు గత పది రోజుల నుండిసంఘం రాష్ట్ర ప్రతినిధులు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల కోసం ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. పట్టణంలో పలు పాఠశాలలు మరియు కళాశాలలో, గ్రామాలలో నిరుద్యోగులను కలిసి స్వయంగా ఫారాలు నింపి అప్లికేషన్స్ ఆన్లైన్ చేసే కార్యక్రమం చేపట్టారు. కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు జిల్లాలలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. అదే విధంగా హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు సంబంధించి కూడా ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కారింగుల శ్రీనివాస్ గౌడ్, మద్దికుంట్ల సైదులు, పులి వెంకటేశ్వర్లు, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, బచ్చలకూరి గురువయ్య, బత్తిని సాయి తదితరులు పాల్గొన్నారు .

# బస్వాపూర్ నిర్వాసితులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ

**లప్ప నాయక్ తండా వాసులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

**యాదగిరిగుట్ట అక్టోబర్ 9 (జనంసాక్షి)**
బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన లప్ప నాయక్ తండా నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామ సమీపంలో నిర్వహించిన ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన లప్ప నాయక్ తండా నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమం, పునరావాసానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రాంత అభివృద్ధి సాధించడంతో పాటు, ఆ ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు తగిన న్యాయం చేయడం, వారికి నివాస వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.
గతంలో నష్టపరిహారం కోసం లప్పనాయక్ తండా వాసులు ఉద్యమిస్తున్న సమయంలో కూడా అన్నదానం పెట్టించి మద్దత్తు తెలియజేశామను ఇప్పటి ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క గారు, పాదయాత్ర లో బాగంగా మీకు న్యాయం చేస్తామన్న హామీ మేరకు,నష్టపరిహారం తో ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తీసుకొని ఇందిరమ్మ ఇళ్ల విషయం లో ప్రత్యేక కోట ఇస్తామన్నారు. భూములు కోల్పోయిన కుటుంబాలు ఆందోళన చెందకుండా, వారికి భరోసా కల్పించి, గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు అవసరమైన పునరావాస చర్యలు చేపట్టడం ముఖ్యమని అన్నారు. లప్ప నాయక్ తండా వాసులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేయడం ద్వారా వారు తమ సొంత ఇంటి నిర్మాణానికి ముందడుగు వేసే అవకాశం కలుగుతుందని తెలిపారు ఇల్లు ఇవ్వటమే కాకుండా మినీ బంజారాహిల్స్ లాగా మారుస్తామన్నారు. ఇక్కడ ఇల్లు నిర్మాణం అయ్యాక మాత్రమే తండా లో కాళీ చేయిస్తామని.. తండా కాళీ చేయించక మాత్రమే టీ ఏం సి పెంచుతామన్నారు రూ. 26.50 కోట్లతో పునరావాసం, 250 ప్లాట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా పరిష్కార మార్గాలను అన్వేషించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో నిర్వాసితుల సంక్షేమాన్ని విస్మరించకుండా, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ, అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి పునరావాస ఫలాలు అందేలా కృషి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లప్ప నాయక్ తండా గ్రామస్తులు, నిర్వాసిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.



జనంసాక్షి

# దమ్మపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

### వన్యప్రాణుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యం

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం



**దమ్మపేట అక్టోబర్ 9 (జనంసాక్షి):** జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు?2026 సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా "వన్యప్రాణుల సంరక్షణ మరియు జీవవైవిధ్యం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు ప్రకృతి పరిరక్షణపై వారిలో బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసి బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడం తో పాటు పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రకృతిలోని ప్రతి జీవికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ద్వారా పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవచ్చని తెలిపారు. అడవుల నరికివేతను అరికట్టడం, వన్యప్రాణుల ఆవాసాలను సంరక్షించడం, అక్రమ వేటకు దూరంగా ఉండటం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. వన్యప్రాణులను రక్షించడం అటవీ శాఖ ఒక్కటే చేయాల్సిన పని కాదని, సమాజం లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అడవులు మానవాళికి అందించే ప్రయోజనాలను వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం, చెట్లను సంరక్షించడం, వన్యప్రాణులకు హాని కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకుని తమ కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతరులకు కూడా ఆ సందేశాన్ని చేరవేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో దమ్మపేట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జయరామ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రామారావు, రవి, బేస్ క్యాంప్ సిబ్బంది రాకేష్, రాంబాబుతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడుకోవడంలో విద్యార్థులు సైతం చురుకుగా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.




# ఆర్టీఐ చట్టంపై అధికారులకు అవగాహన తప్పనిసరి

- ప్రతి శాఖ అధికారి చట్ట ప్రకారం విధులు నిర్వహించాలి..ఆర్డీవో
- చండూరు డివిజన్ స్థాయిలో ఆర్టీఐపై అవగాహన కార్యక్రమం

చండూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి)
సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) నిబంధనలపై ప్రతి శాఖ అధికారి అవగాహన కలిగి ఉండాలని, చట్ట ప్రకారం విధులు నిర్వహించాలని చండూరు ఆర్డీవో వి. శ్రీదేవి సూచించారు. ఆర్టీఐ వారోత్సవాలు?2026లో భాగంగా శుక్రవారం చండూరు డివిజన్ స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వి. శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు సమాచారం అందించే విషయంలో అధికారులు చట్ట నిబంధనలను పాటించాలని, సమాచార హక్కు చట్టం పరిధి, దరఖాస్తుల స్వీకరణ, సమాచారాన్ని అందించే విధానం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు చట్టంలోని నిబంధనలను తెలుసుకొని, వాటికి అనుగుణంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ శాఖల ద్వారా అందాల్సిన సమాచారం విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని, చట్టంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా పరిపాలనలో పారదర్శకతను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహశీల్దార్ రమాకాంత్ శర్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గాంధీజీ లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

### సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి)**
దసరా సెలవులు ప్రారంభం కానున్న దృష్ట్యా ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు గౌరీదేవికి పూలమాలలు వేసి పూజ చేసి బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి మరియు సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగను తెలంగాణ ఆడపడుచులు వారి పుట్టింటిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ... బంధాలు మరియు అనుబంధాలను గుర్తు చేసుకుంటూ.... ఆడపడుచులు తొమ్మిది రోజులపాటు పూలతో గౌరీదేవిని పూజిస్తారని, మహాలయ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై చివరి రోజు సద్దుల బతుకమ్మగా ముగుస్తుందని తెలిపారు. విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో, పూలతో అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల బతుకమ్మలతో పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ పర్యావరణాన్ని ఆదరించే ఆచారానికి ప్రతీక అని పేర్కొన్నారు. సత్యం చెడుపై గెలిచే విజయదశమి సందేశం చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ జానీ, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






# ఈ నెల 11 నుండి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో ఈ నెల 11 నుండి విజయదశమి వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం అధ్యక్ష కార్యదర్శులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, పబ్బ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం దేవాలయంలోని ఆధ్యాత్మిక గ్రంథాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రోజుకొక రీతిలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు కుంకుమ పూజలతో పాటు ఉదయం సాయంత్రం చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 రోజులపాటు దేవాలయంలో కలశం ఏర్పాటు చేసి భవాని దీక్ష పూజలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అన్నపూర్ణాదేవి అలంకరణ సందర్భంగా అన్నదాన కార్యక్రమంతో పాటు మూల నక్షత్రం శ్రీసరస్వతి దేవి అమ్మవారి అలంకరణ రోజున ఉదయం చిన్నారులకు అక్షరాభ్యాసములు, సాయంత్రం విద్యార్థిని విద్యార్థులకు విద్యాభివృద్ధికి సరస్వతి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అక్టోబర్ 20 విజయదశమి సందర్భంగా జమ్మిగడ్డ లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మున్సిపాలిటీ సహకారంతో శమీ పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 రోజులపాటు జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కోశాధికారి కొత్త మల్లికార్జున్, కన్వీనర్ నరేంద్రుని విద్యాసాగర్ రావు, ఉపాధ్యక్షులు బెలిదే అశోక్, సోమ శ్రీశైలం, పాలవరపు రామమూర్తి, తాళ్లపల్లి రామయ్య, సహాయ కార్యదర్శులు దేవరశెట్టి సోమయ్య, యామ వెంకటేశ్వర్లు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలి

### భాజపా నేరేడుచర్ల పట్టణ అధ్యక్షులు కొణతం:నాగిరెడ్డి



**నేరేడుచర్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి):**
విద్యార్థులు చదువుతోపాటు దేశభక్తిని కూడా అలవర్చుకొని దేశ సంక్షేమం కోసం కృషి చేయాలని నేరేడుచర్ల భాజపా పట్టణ అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినని మరియు 25 సంవత్సరాల రాజకీయ జీవితం పూర్తి చేసుకున్న సందర్భాన స్థానిక శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో వ్యాస రచన, చిత్రలేఖనం నిర్వహించి పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానం సందర్భంగా అయన మాట్లాడుతూ...విద్యార్థులు మంచిగా చదువుకొని మంచి ఉద్యోగాన్ని పొందాలని దేశ సంక్షేమం కొరకు అహర్నిశలు పాటుపడాలన్నారు. భాజపా జిల్లా ట్రెజరర్ తాళ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబంలో ఎవరి పుట్టినరోజు వచ్చినా వారు ఒక మొక్క నాటి దాని పూర్తి సంరక్షణ బాధ్యత తీసుకొని పర్యావరణానికి కృషి చేయాలని , పర్యావరణం కాపాడుకోకపోతే మనిషి మనుగడ అంధకారం అవుతుందన్నారు. వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి ఎం.ప్రవస్తి, ద్వితీయ బహుమతి జె.మౌనిక, తృతీయ బహుమతి కె.సాయి చరణ్, అలాగే డ్రాయింగ్ పోటీలో ప్రథమ బహుమతి పి.భవ్యశ్రీ, ద్వితీయ బహుమతి డి.సత్యహని, తృతీయ బహుమతి పి.శీర్షిక లు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొనటం సీతారానీరెడ్డి,జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొప్పు లక్ష్మీ నారాయణ, జిల్లా దివ్యాంగ కన్వీనర్ ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కాలం నాగయ్య, పట్టణ నాయకులు వెన్నం సురేష్ నాయుడు, దేవిరెడ్డి నాగిరెడ్డిలు పాల్గొని బహుమతులు అందించారు.

# ముందస్తు బతుకమ్మ వేడుకలు



**జాజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** జాజిరెడ్డిగూడెం మండలం లోని అర్వపల్లి పీ ఎం శ్రీ జడ్పీహెచ్ఎస్, ఎం పీ పీ ఎస్, జాజిరెడ్డిగూడెం జడ్పీహెచ్ ఎస్, ఎం పీ పీ ఎస్, హర్షాయపల్లి ఎం పీపీ ఎస్ తదితర పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థినిలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో కలిసి ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, హెచ్ఎంలు పి. మల్లేష్, ఎన్. మంజుల, విమలకుమారి, స్వరూపరాణి, ఆచారి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.